క్లుప్తంగా

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి

రాజానగరం: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం ముంగిట స్థానిక కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక అన్న సమారాధనకు హాజరైన ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా కరుణించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద పాల్గొన్నారు.

నేడు లక్ష పత్రి పూజ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో వేంచేసిన శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం లక్షపత్రి పూజ, భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త వద్ద క్రొవ్విడి సత్రాజు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కార్తిక మాసం, మాస శివరాత్రిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యేకాలంకరణలో గోలింగేశ్వర స్వామి



గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువై ఉన్న గోలింగేశ్వరస్వామి ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం కార్తిక బహుళ త్రయోదశి సందర్భంగా స్వామి వారి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివరూపంలో స్వామిని అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



సూర్యదేవుడు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధిచెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు వెంకటనరసింహాచార్యులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ



సోమేశ్వరస్వామి, అమ్మవారు

పెదపూడి: ప్రాచీన ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు లక్ష తులసి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు కె.వెంకట్రావు ఆధ్వర్యంలో పండితులు, పది మంది రుత్వికులు పూజలు చేశారు. పలువురు దంపతులు యజ్ఞకర్తలుగా ఆశీనులయ్యారు. అమ్మవారి కుంకుమ పూజ, హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

దూబచర్ల నుంచి పిఠాపురానికి పాదయాత్ర



రాజానగరం చేరుకున్న దత్తసాయి భక్తులు

రాజానగరం: పశ్చిమ గోదావరి జిల్లా దూబచర్ల నుంచి దత్తసాయి భక్తులు కాకినాడ జిల్లా పిఠాపురంలోని దత్త క్షేత్ర సందర్శనార్థం చేపట్టిన పాదయాత్ర ఆదివారం మధ్యాహ్నం రాజానగరం చేరుకుంది. వారికి స్థానిక భక్త బృందం స్వాగతం పలికి, ఎం.సుబ్బిరెడ్డి, అబ్బాయిరెడ్డిల ఇంట ఆతిథ్య మిచ్చారు. అనంతరం పిఠాపురానికి తమ పాదయాత్రను కొనసాగించారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామం ఎస్సీ పేటలో ఉన్న ఎంపీపీ పాఠశాల నం.1 ప్రహరీ నిర్మాణానికి సర్పంచి సబ్బారపు పద్మావతి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనపర్తికి చెందిన ఐటీసీ సంస్థ రూ 6.61 లక్షలతో ఈ నిర్మాణం చేస్తోందని ఆమె చెప్పారు. దీనిలో 80 శాతం ఐసీటీ సంస్థ, 20 శాతం పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్నట్టు వివరించారు. పంచాయతీ వార్డు సభ్యుడు మల్లిరెడ్డి వీరదుర్గాప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శీతాకాల నేస్తం



అనపర్తి వంతెన వద్ద ఉన్ని దుస్తులు విక్రయిస్తున్న వ్యాపారి

- విపరీతంగా పెరిగిన చలి
- రగ్గులు,స్వెట్టర్లకు గిరాకీ
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విక్రయాలు

బిక్కవోలు: అమ్మో.. చలి పంజా విసురుతోంది. చీకటి ముసురు కుంటుందో, లేదో వెంటనే చలి చంపుతోంది. ఉదయం తొమ్మిదైనా మంచువీడడం లేదు. దీనికి విరుగుడు ఉన్నిదుస్తులే. చలికాలం వచ్చిందంటే చాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు ఉన్ని దుస్తులు విక్రయిస్తామంటూ సిద్ధమైపోతారు. రగ్గులు, మఫ్లర్లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్‌గ్లౌజ్‌లు, స్వెట్టర్లు, ఇయర్‌కప్స్ తదితర వస్తువులను విక్రయిస్తున్నారు. ఆయా దుకాణాలతో అనపర్తి వంతెన వద్ద అనుకుని ఒకటే సందడి. అలాగే మెయిన్‌రోడ్డులోను, బిక్కవోలు, జి.మామిడాడలోను, సాధారణ షాపుల్లోను వీటి విక్రయాలు సాగుతూనే ఉంటాయి. మధ్యప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వలస వ్యాపారులు.. మూడు నెలలు ఇక్కడ కశ్మీర్ రగ్గులు, శీతాకాలం రక్షణ కల్పించే ఇతర ఉన్ని వస్త్రాలను ఇక్కడ విక్రయిస్తారు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలలు వీరికి మంచి సీజన్ కాగా, మొదటి రెండు నెలల వ్యాపారం జోరుగా సాగుతుంది. సింగిల్ కాట్‌కు సరిపోయే రగ్గు జత రూ.400 నుంచి నాణ్యతను బట్టి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. ఇతర సైజుల్లో రూ.200 నుంచి రూ.500 చేసి అమ్ముతున్నారు. చిన్న పిల్లల స్వెట్టర్లు రూ.150 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి. మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు రూ.30 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి రోడ్డు పక్కన విక్రయించే ఈ వలస వ్యాపారులు రాత్రి వేళల్లో చలి నుంచి రక్షణగా రగ్గులు కప్పుకుని, ఉన్నచోటే నిద్రపోతున్నారు.

తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశాం



మా ప్రాంతంలో కొనుగోలు చేసిన రగ్గులు, ఇతర వస్త్రాలను మూడు నెలల పాటు వంతెన రోడ్డు పక్కన తాత్కాలికంగా దుకాణాలు పెట్టి విక్రయిస్తున్నాం. చాలా మంది కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తారు. అమ్మకాలు ముగించుకుని ఫిబ్రవరి నెలలో తిరిగి స్వస్థలానికి వెళ్లిపోతాం.

– మోతిలాల్, ఉన్ని దుస్తుల వ్యాపారి, మధ్యప్రదేశ్

ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



శీతాకాలంలో వీచే చలిగాలులకు జలుబు, జ్వరం ఎక్కువగా వస్తాయి. మంకీ క్యాప్‌లు, రగ్గులు, స్వెట్టర్లు వాడడం వల్ల కొంతమేర చలి గాలుల నుంచి తప్పించుకోవచ్చు. చిన్న పిల్లలను ఎక్కువగా చలిగాలుల్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రామానంద్ సాగర్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, అనపర్తి

సంక్షేమ పథకాల స్వర్ణయుగ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



అనపర్తి మార్కండేయపురంలో మహిళకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాల స్వర్ణయుగ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయం–2లోని మార్కండేయపురం, ఎన్టీఆర్‌కాలనీ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా వెలుగులు నిండాయని, పథకాల లబ్ధి పొందిన వారంతా ప్రభుత్వ పని తీరు మెచ్చుకుంటున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్యే.. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు తెలుసుకుంటూ, భరోసానిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు అడగడుగునా మంగళహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీలు బండారు శ్రీను, కొండేటి భీమేష్, పార్టీ నాయకులు పాదూరి దేవిద్‌రాజు, సత్తి సూరారెడ్డి, కోనాల సత్యనారాయణ రెడ్డి, కానూరి కృష్ణ, ర్యాలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నూరు శాతం నెరవేర్చాం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- చక్రద్వారబంధంలో గడప గడపకూ మన ప్రభుత్వం



చక్రద్వార బంధంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వాల మాదిరిగా అధికారంలోకి వచ్చాక గాలికి వదిలేయకుండా నూటికి నూరు శాతం అమలు చేసి చూపిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నైజంతో గత నాలుగేళ్లలో హామీలన్నింటినీ నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని గర్వంగా చెప్పగలుగుతున్నానన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి, ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయతతో పలుకరించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ఏ మేరకు వారికి అందాయో డేటాతో సహా వివరించారు. ఇంకా వారికి ఏం అవసరాలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఇంకా ఏమి ఆశిస్తున్నారనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే ఇంటి స్థలాలను అందజేస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పై కొంతమంది మహిళలు అడగడంతో జాప్యానికి గల కారణాలను వారికి తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తోడ్పడి, రాష్ట్రంలో మరోసారి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నాయకులు నాగవరపు త్రిమూర్తులు, నీలపాల శివరామకృష్ణ, మార్గాని శ్రీను, దుర్గారమేష్, గుత్తుల చంద్రరావు, కురుమళ్ల బాబి, యాళ్ల నిరీక్షణరావు, సత్యనారాయణ, వెంకటరమణ,పితాని రాంబాబు, కోలాటి వెంకన్న, భానుశంకర్ పాల్గొన్నారు.

వర్షం నీటిలో 3 వేల హెక్టార్ల పంట పొలాలు



చినకొండేపూడిలో నీట మునిగిన మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

సీతానగరం: మిచాంగ్ తుపాను వలన కురిసిన అధిక వర్షాలకు వివిధ రకాల పంటలు ముంపులోకి వెళ్లాయని మండల ఆర్బీకె చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు), ఏవో కె.సూర్యరమేష్ తెలిపారు. ఆదివారం ముంపులో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. ఎక్కువగా వరి, మొక్కజొన్న, పొగాకు నీట మునిగాయని సుమారు మూడు వేల హెక్టార్లు ఉంటుందన్నారు. పడిపోయిన వరి పంట మొలకెత్తకుండా, రంగు మారకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, నీరు బయటకు వెళ్లే మార్గం చూపే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ముదునూరి రామకృష్ణంరాజు, పోలినాటి రామచంద్రరావు, కోసూరి నాగరాజు, ముదునూరి సుబ్రహ్మణ్యం, లక్కిశెట్టి శ్రీనివాస్, అల్లూరి రాంబాబు, గోపిశెట్టి తులసిరావు పాల్గొన్నారు.

12 నుంచి జీడీఎస్ ఉద్యోగుల సమ్మె

రంగంపేట: డిమాండ్ల సాధన కోసం గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు ఈ నెల 12(మంగళవారం) నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజనల్ కార్యదర్శి పైడిశెట్టి భూలోకం తెలిపారు. వడిశలేరు పోస్టాఫీసు వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కొంతకాలంగా కోరుతున్నప్పటికీ కేంద్రప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. ప్రధానంగా 8 గంటల పని వేళలు, పింఛను సహా అన్ని ప్రయోజనాలు, సీనియర్ జీడీఎస్‌లకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు వంటి 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. కేంద్ర వైఖరికి నిరసనగా దశలవారీ ఉద్యమానికి నిర్ణయించామని చెప్పారు. ఈ నెల 12న దేశ వ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల వద్ద సమ్మె చేస్తామన్నారు.

రెడ్డి అన్నది అన్ని కులాల సంఘటిత శక్తి

- కోలాహలంగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వన సమారాధన
- 40 గ్రామాల నుంచి భారీగా హాజరు



కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘ వన సమారాధనలో పాల్గొన్న ప్రముఖులు

అనపర్తి: రెడ్డి అన్నది ఓ కులం కాదని, అన్ని కులాల సంఘటిత శక్తి అని, ఈ కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నేటి వరకు పలువురు సామాజిక వర్గీయులే పాలనా పగ్గాలు చేపట్టడానికి కారణమని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం కార్తిక వన సమారాధనలో పాల్గొన్న అతిథులు పేర్కొన్నారు. ఆదివారం దుప్పలపూడిలోని నేషనల్ వెంకటరెడ్డి గారి తోటలో ఈ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సుమారు 40 గ్రామాలకు చెందిన రెడ్డి సామాజిక వర్గీయులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనపర్తి, పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది రెడ్డి కులస్తులు జీవనోపాధిగా ఫైనాన్స్, లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. వారి ఆర్థిక లబ్ధితో పాటు పరోక్షంగా సామాజిక ఆర్థిక అవసరాలను తీర్చిన వారవుతున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫైనాన్స్ వ్యాపారులపై అక్రమంగా కాల్‌మనీ కేసులు పెట్టి, వేధింపులకు గురి చేశారన్నారు. ఈ చర్యలతో అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు గురయ్యారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ అధికారాన్ని చేపట్టాక ఈ తరహా వేధింపులకు తావు లేకుండా పోయిందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్తులు సమాజంలో పదిమందికి తమకు చేతనైన సాయం చేసేవారే మినహా, దోచుకుతినే వారు కాదన్నారు. దీనిని గుర్తించి మిగిలిన సామాజిక వర్గీయులు రెడ్డి కులస్తులకు నాయకత్వాన్ని అప్పగిస్తున్నారని చెప్పారు. దీనికి తార్కాణమే ఏపీలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తెలంగాణలో ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా పాలన సాగిస్తున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పునర్విభజనలో మూడు జిల్లాలుగా అయిందని తెలిపారు. కాకినాడ జిల్లా నుంచి తాను, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కోనసీమ అంబేడ్కర్ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నామని పేర్కొన్నారు. తిరిగి తమను ఎమ్మెల్యేలుగా గెలుపించుకోవాలని అభ్యర్థించారు. సంఘ అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, భూదాన్ యజ్ఞ బోర్డ్ చైర్మన్ విజయభాస్కరరెడ్డి, డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రంగంపేట హైస్కూల్లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంగంపేట: అమ్మని, చదువునేర్పిన బడిని జీవితంలో ఎప్పుడూ మరువరాదని సీనియర్ ఉపాధ్యాయులు ఎన్.రామసుబ్రహ్మణ్యం, ఎం. దుర్గాప్రసాద్, గంటా రమణబాబు అన్నారు. ఆదివారం రంగంపేట జెడ్పీ హైస్కూల్‌లో 2005 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చదువుకున్న బడికి, పుట్టి పెరిగిన ఊరికి ఎంతో కొంత సేవా కార్యక్రమం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయుడు వీరభద్రరావు చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.



కొంకుదురులో కలుసుకున్న ఏడో తరగతి పూర్వ విద్యార్థులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 1984–85 ఏడో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఏటా కుటుంబ సమేతంగా కలుసుకుంటామని, 39 ఏళ్లుగా ఇది కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. పెళ్లయి.. పాతికేళ్లు పూర్తి చేసుకున్న దంపతులను సత్కరించారు. బిక్కవోలు మండలం మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఎస్‌వీ సూర్యనారాయణ రెడ్డి, వ్యాపార వేత్త కర్రి గంగిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోని కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పివి తదితరులు పాల్గొన్నారు.

సోమనవారితోటలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి తలుపులు పగులగొట్టిన దొంగలు రెండు కాసుల బంగారు వస్తువులు,నగదు చోరీ చేశారని బొమ్మూరు సోమనవారితోటకు చెందిన తిరుమల సత్యనారాయణ ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లగా, భార్య, పిల్లలు షాపింగ్‌కు వెళ్లారు. రాత్రి డ్యూటీ దిగి సత్యనారాయణ ఇంటికి వచ్చేసరికి ఈ చోరీ జరిగింది.

అందరినీ ఏకం చేసేందుకే వన సమారాధనలు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పుష్కరవనంలో కార్తిక వన సమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, పక్కన ఎంపీ భరత్‌రామ్

రాజానగరం: సంఘం విలువను, అవసరాన్ని తెలియజేసి, అందరినీ సమష్టిగా కలిపేందుకే కార్తిక వన సమారాధనలని రాష్ట్ర వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. లాలాచెరువులోని గోదావరి మహాపుష్కరవనంలో ఆదివారం జరిగిన శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజిక వర్గీయుల కార్తిక వన సమారాధనలో మంత్రి పాల్గొన్నారు. ఉన్నత స్థానంలో ఉన్నవాడు తన వారిని కూడా ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు అవసరమైన చేయూతనివ్వాలన్నారు. అందుకు రాజకీయ ప్రాధాన్యం ఉంటేనే రాజకీయంగా మన వాటాను పొందగలమని, మన వారికి చేయూతనివ్వగలమన్నారు. ఎంతో కష్టతరమైన కల్లుగీత వృత్తి ద్వారా మన ఎదుగుదలకు పూర్వీకులు ఎంతో శ్రమించారన్నారు. అయితే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతోమంది ఎదుగుదలకు కారణమైందన్నారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ సంఘీయులంతా పరస్పర సహాయ సహకారాలను అందించుకుంటూ మనందరి ప్రగతికి తోడ్పడాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ రాజకీయంగా ఎదగాలంటే సమష్టి కృషి అవసరమని, ఎన్నికలలో పోటీ చేసి మనవారి గెలుపుకు సమష్టిగా పనిచేసి, ఐక్యతను చాటాలన్నారు. ఐదు కులాల పేర్లతో ఉన్న మనమంతా ఒక్కటేనని, అంతా కల్లుగీత కులస్తులమేనన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, నాయకులు గూడూరి శ్రీనివాస్, రౌతు శిరీష, మార్గాని నాగేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు, బుడ్డిగ శ్రీనివాస్, రెడ్డిరాజు, కుడిపూడి సారథి, మార్గాని చంటిబాబు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

రాజానగరం: దివాన్‌చెరువులో స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన జరిగింది. ముందుగా ఉసిరి చెట్టు వద్ద ఇష్టదైవాలకు పూజలు చేశారు. అనంతరం ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. వృద్ధులైన ఆర్యవైశ్యులను సత్కరించారు. సంఘ ప్రతినిధులు గ్రంది నానబ్బులు, గ్రంధి రాజా, నున్న సూరిబాబు, తొంటెపు సత్తిబాబు, కారుమూరి సురేష్, తమ్మన కిషోర్ పాల్గొన్నారు.



కాపుల ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వనసమారాధనలో పాల్గొన్న సంఘీయులు

ఘనంగా కార్తిక వన సమారాధనలు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శ్రీవాసవీ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీరామనగరం దగ్గరలో గల పల్లేటివారి కొబ్బరి తోటలో శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధన కార్యక్రమంలో మండలంలోని సుమారు 15 వందల మంది వైశ్యులు పాల్గొన్నారు.

కాపు సంఘం ఆధ్వర్యంలో: రఘుదేవపురం కాపు పెద్దలు, కాపు యువత ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. రఘుదేవపురం లంకభూమిలోని పామాయిల్ తోటలో 1800 మంది కార్తిక వనసమారాధనలో పాల్గొన్నారు.



ముకుందవరం వన సమారాధనలో మాట్లాడుతున్న జోగేంద్రనాథ్

సమాజ ఐక్యతకు వన సమారాధనలు దోహదం

రంగంపేట: కార్తిక వన సమారాధనలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని సత్యసాయి సేవా సంస్థల తుని సబ్ జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్ అన్నారు. ఆదివారం ముకుందవరం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా సేవాదళ్ కన్వీనర్ పాలచర్ల శ్రీనివాస్, పెద్దాపురం సబ్‌జోన్ కన్వీనర్ కాశీ విశ్వేశరరావు, భజన మండలి కన్వీనర్ వట్టికూటి సాయిచంద్రరావు, బాలవికాస్ గురువు సుక్కిరెడ్డి పోలరాజు, సేవాదళ్ సభ్యులు పంట సాంబశివరావు, సుంకర కామరాజు, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

బిక్కవోలు: పందలపాకకు చెందిన సూర్యనారాయణ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యనారాయణరెడ్డి గోడౌన్స్ వద్ద పొలాల్లో ఆదివారం కార్తిక వన సమారాధన జరిగింది. ముందుగా మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం వన సమారాధన జరిగింది. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు, ఫౌండేషన్ చైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పడాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు రోడ్డులో వన సమారాధనల సందడి

మధురపూడి: కార్తిక మాసం ముగియనున్న నేపథ్యంలో ఆదివారం ఎయిర్‌పోర్టు రోడ్డులో సందడి నెలకొంది. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వరకూ గల తోటలకు ప్రజల రద్దీ ఏర్పడింది. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజామహేంద్రవరం, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఇక్కడికి చేరుకున్నారు. భార్గవ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రత్నా ప్లాస్టిక్ కంపెనీకి చెందిన మామిడితోటలో వనసమారాధన జరిగింది. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పరస శ్రీను, భగవాన్ శర్మ పాల్గొన్నారు.

తోకాడలో ఊరచెరువుకు గండి



చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న తహసీల్దారు పవన్‌కుమార్

రాజానగరం: మండలంలోని తోకాడ ఊరచెరువుకు గండి పడింది. చెరువు నుంచి ఒకేసారి భారీగా నీరు ప్రవహించడంతో దిగువన ఉన్న మల్లంపూడిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ ముంపునకు గురైంది. వేగిశెట్టి సింహాచలానికి చెందిన ఒక గేదె మృత్యువాత పడగా, మొగలపు వెంకటేశులు కౌలు చేస్తున్న మేకల చిన్న పొలంలో రాశివేసి ఉంచిన ధాన్యంలో 45 బస్తాల ధాన్యం వరకు కొట్టుకుపోయింది. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ, వ్యవసాయాధికారులు గండి పడిన చెరువు ప్రాంతాన్ని పరిశీలించి, జరిగిన నష్టాన్ని నమోదు చేసుకున్నారు. 27.94 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు మరమ్మతులు చేస్తున్న సమయంలో ఇటీవల కురిసిన భారీవర్షాలతో భారీగా చేరిన ముంపునీటి ఉధృతికి గట్టు బలహీనపడి గండి పడిందని తహసీల్దారు పవన్‌కుమార్ తెలిపారు. పూర్తి స్థాయి విచారణ జరుగుతుందన్నారు.

ఓర్వలేకనే ఆరోపణలు

గ్రామంలో జరుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చెరువుకు పడిన గండిపై ప్రతిపక్షాల వారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తోకాడ సర్పంచ్ వేగిశెట్టి వీవీ చక్రధరరావు(పోతురాజు) ఒక ప్రకటనలో అన్నారు. రూ.ఒక కోటి 30 లక్షల వ్యయంతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మొదటి విడతగా రుడా నుంచి రూ.41 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందుకు సంబంధించిన పనులు జరుగుతున్న సమయంలో చెరువులోకి వచ్చి చేరిన ముంపు నీటి తాకిడితో గండి పడిందన్నారు. గతంలో కూడా ఇటువంటి ప్రమాదాలు జరిగాయని, కానీ ఈసారి మాత్రం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు దుర్బుద్ధితో లేనిపోని రచ్చ చేస్తున్నారని ఆరోపణలను కొట్టివేశారు.